సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 14 । నవంబర్ । 2024



లక్ష లిల్లీ పూలతో అర్చన

జంగారెడ్డిగూడెం రూరల్: కార్తీక మాసోత్స వాల్లో భాగంగా బుధవారం గురవాయి గూడెం మద్ది ఆంజనేయస్వామికి అర్చకులు లక్ష లిల్లీ పూలతో అర్చన నిర్వహించారు.



లేబర్ అధికారుల తనిఖీలు

జంగారెడ్డిగూడెం: అధికారులు జంగారెడ్డి గూడెం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. వలస కార్మికుల పిల్లల పేర్లను అం గన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయించారు.



ఎస్పీ ఆకస్మిక తనిఖీ

కొయ్యలగూడెం: సైబర్ నేరాల నిర్మూలనపై దృష్టి సారించాలని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ పేర్కొన్నారు. బుధవారం కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటింటా క్యాన్సర్ పరీక్షలు



కలెక్టరేట్‌లో ఇంటింటా క్యాన్సర్ సర్వే పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): ఈనెల 14 నుంచి ఇంటింటా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సర్వే గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటి సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా హైపర్ టెన్షన్, మధుమేహం, నోరు, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమం 9 నెలల పాటు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, అంగన్‌వాడీ పీడీ సుజాతరాణీ తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో బస్టాండ్ ఏర్పాటు చేయాలి



శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

భీమవరం: నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో బస్టాండ్ లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ శాసనమండలిలో ప్రస్తావించారు. బుధవారం శాసనమండలి సమావేశంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రమైనప్పటికీ బస్టాండ్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఆచంట నుంచి పరిసర ప్రాంతాలకు చెందిన అనేకమంది నిత్యం వివిధ ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణిస్తారని బస్సుల కోసం ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ వేచి చూడాల్సి వస్తుందన్నారు.

మున్సిపాలిటీలపై సమీక్ష

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపల్ కార్యాలయంలో జిల్లాలోని మున్సిపాలిటీలపై మున్సిపల్ రీజనల్ డిప్యూటీ డైరక్టర్ సీహెచ్ నాగనరసింహరావు బుధవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం పన్నుల వసూలు మెరుగైన రీతిలో ఉండాలన్నారు. పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని, ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. బిల్డింగ్ ప్లాన్ పెండింగ్ లేకుండా మంజూరు చేయాలని, పట్టణాలలోని ఆక్రమణలపై దృష్టి సారించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసంలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా ఉన్న వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డపింగ్ యార్డ్‌ను పరిశీలించి నిర్వహణపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి, తణుకు మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, పాలకొల్లు కమిషనర్ విజయ సారధి, ఆకివీడు కమిషనర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.



పుష్కరిణి వద్దకు తరలి వెళ్తున్న శ్రీవారు

తెప్పోత్సవం.. భక్తకోటి పరవశం

ద్వారకాతిరుమలలో వేడుక

ద్వారకాతిరుమల: హంసవాహన తెప్పలో ఉభయ దేవేరులతో శ్రీవారు సుదర్శన పుష్కరిణిలో బుధవారం రాత్రి విహరించారు. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ తెప్పోత్సవ వేడుక భక్తులకు కనువిందు చేసింది. విద్యుద్దీప కాంతులు, బాణాసంచా సందళ్లు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణలు, అర్చకులు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ ఉత్సవం భక్తకోటిని పరవశింపజేసింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. తిరువీధి సేవ అనంతరం స్వామివారి వాహనం అట్టహాసంగా సుదర్శన పుష్కరిణి వద్దకు చేరుకోగా, అప్పటికే శోభాయమానంగా అలంకరించిన హంస వాహన తెప్పలో శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేపు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకారాలు చేసి, హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఈఓ ఎన్వీఎస్ఎన్ మూర్తి, పెన్మత్స నరసింహరాజు పూజాధికాలు నిర్వహించారు. ఆ తరువాత భక్తుల గోవింద నామ స్మరణల నడుమ తెప్ప పుష్కరణిలో విహరించింది.





బాణసంచా కాల్పులు, పుష్కరిణిలో తిరుగాడుతున్న హంస వాహన తెప్ప

అన్నదాతలో అలజడి

- ఆందోళన కలిగిస్తున్న అల్పపీడనం
- ఉమ్మడి జిల్లాలో మొదలైన ఖరీఫ్ మాసూళ్లు
- వరి కోతలు, పట్టుబడి పనుల్లో రైతులు
- ఉమ్మడి జిల్లాలో 3.95 లక్షల ఎకరాల్లో సార్వా సాగు
- ఇంతవరకు 5 శాతం విస్తీర్ణంలో పూర్తయిన వరి కోతలు



పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో గాలులకు నేలవాలిన వరిపంట

సాక్షి, భీమవరం: ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి అవస్థలు పడుతున్న అన్నదాతలకు సాగు చివరిలోనూ తిప్పలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరికోతలు మొదలయ్యాయి. పంట చేతికందుతున్న సమయంలో అల్పపీడనం ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 2.05 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 1.90 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేపట్టారు. పంట చివరి దశకు చేరుకోగా ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, దెందులూరు, తణుకు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే ఐదు శాతం విస్తీర్ణంలో వరికోతలు పూర్తి కాగా ధాన్యం అరబెట్టుకునే మిల్లులకు తరలించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మరో వారం పది రోజుల్లో మాసూళ్లు ముమ్మరం కానున్నాయి. డిసెంబరు మొదటి వారం నాటికి చాలా వరకు పంట ఒబ్బిడ వుతుందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు.

ఆరంభం నుంచి అవస్థలే.. మునుపెన్నడూ లేని విధంగా నాట్ల దశలోనే భారీ వర్షాలు, వరదలు పంటకు నష్టం కలిగించాయి. ఆగస్టు చివరిలో కురిసిన వర్షాలకు వయ్యేరు, ఎర్రకాలువ, యనమదుర్రు, ఉప్పుటేరు తదితర డ్రెయిన్లు పొంగి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 70 వేల ఎకరాల్లోని నాట్లు, నారుమడులకు నష్టం వాటిల్లింది. సెప్టెంబరు మొదటి వారంలో గోదావరి, కొల్లేరు వరదలతో మరోసారి నష్టం వాటిల్లింది. ఈ సీజన్‌లో 60 శాతం విస్తీర్ణంలో ఎంటీయూ 1318 సాగు చేయగా, 30 శాతం విస్తీర్ణంలో స్వర్ణ, సంపద స్వర్ణ వంగడాలను సాగు చేశారు. సీజన్ పొడవునా చాలా వరకు ఆకాశం మేఘావృతమై ఎండకాసే సమయం (సన్‌షైన్ అవర్స్) తక్కువగా ఉండటం వల్ల కొంతమేర దిగుబడులు తగ్గుతున్నాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. స్వర్ణ 35 బస్తాల నుంచి 38 బస్తాలు, సంపద స్వర్ణ 32 బస్తాల నుంచి 35 బస్తాలు, ఎంటీయూ 1318 వెరైటీ 35 బస్తాల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. జిల్లా దిగుబడి ఎకరాకు సగటున 30 బస్తాలు ఉండవచ్చనని అభిప్రాయపడుతున్నారు. ఎంటీయూ 1318 వెరైటీకి గాలులను తట్టుకునే స్వభావం ఉన్నప్పటికి వాతావరణం ఎప్పుడెలా ఉంటుందోనన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. అల్పపీడనం ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ హెచ్చరికలు వారిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొద్దిరోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే తొలకరి పంటను గట్టెక్కించుకుంటామంటున్నారు.

ఆందోళన కలిగిస్తున్న వాతావరణం

ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ వర్షం పడటంతో పాటు చలిగాలులు వీస్తున్నాయి. మంగళవారం జిల్లాలోని భీమవరం, తణుకు, అత్తిలి, పాలకొల్లు, ఆచంట, ఉండి, నరసాపురం ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. ప్రస్తుతం వరి కోతల కోసం కొందరు రైతులు కూలీలను వినియోగిస్తుండగా అధికశాతం వరికోత యంత్రాలను వినియోగిస్తున్నారు. తేమ శాతం తగ్గించేందుకు ధాన్యాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో ఆరబెడుతున్నారు. ప్రస్తుతం ప్రతికూల వాతావరణంతో ఏం చేయాలో రైతులకు పాలుపోవడం లేదు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోతలు కోసిన వారు ధాన్యం ఆరబెట్టి చినుకులు పడితే వెంటనే దగ్గరకు పోగుచేసేందుకు వీలుగా అక్కడే కాపలా ఉంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం ప్రతికూల వాతావరణం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. వర్షం కురిసే అవకాశం ఉన్నప్పుడు కోతలు నిలిపివేసి అనుకూలించాక పనులు చేపట్టాలి. ఎక్కడైనా ధాన్యం వర్షానికి తడిస్తే మొలకలు రాకుండా ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

– జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ, భీమవరం

ఆలయ ఆవరణలో ఫ్లెక్సీల ఏర్పాటు



తణుకులో సోమేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'గుడి నాదే.. చందా ఇవ్వాల్సిందే' అని బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. ఆలయ ఆవరణలో అన్నసమారాధన పేరుతో విరాళాలు వసూలు చేసే క్రమంలో ప్రైవేటు వ్యక్తి భక్తులపై దూషణలకు దిగుతున్నారని వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. వీడియో నేపథ్యంలో సాక్షిలో కథనంతో అధికారులు ప్రత్యేక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అన్నసమారాధన కోసం ఎలాంటి చందాల వసూలు ఆలయంలో, బయట నిర్వహించరాదని ఫ్లెక్సీలో స్పష్టం చేశారు.

సూపర్ సిక్స్ అమలులో రన్ అవుట్

మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : సూపర్ సిక్స్ పేరుతో హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోనే హామీలు అమలు చేయలేక రన్ అవుట్ అయ్యిందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన బుధవారం తాడేపల్లిగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో ఒక్క దీపం పథకానికి మినహా మిగిలిన హామీలకు సంబంధించి కేటాయింపులు చేయలేదని విమర్శించారు. సూపర్‌సిక్స్ పేరుతో అమలు చేయలేని హామీలిచ్చి కూటమి నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందరేశ్వరి ప్రజలను మోసం చేశారని కొట్టు అన్నారు. దీపం పథకానికీ పూర్తిస్థాయిలో కేటాయింపులు జరపలేదన్నారు. ఏడాదికి 3 సిలెండర్లు ఇస్తానని కేవలం బడ్జెట్‌లో రూ.895 కోట్లు కేటాయించారన్నారు.

తల్లికి వందనం అంతంత మాత్రం

తల్లికి వందనం పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే లబ్ధిదారులను కుదిస్తారేమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మంత్రి కొట్టు అన్నారు. జగన్ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం కింద కుటుంబంలో ఒక విద్యార్థికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా రు.6,500 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి కేవలం రూ.5,387 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఒకే కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అంతమందికి ఈ కేటాయింపులతో ఎలా చెల్లింపులు చేస్తారని ప్రశ్నించారు.

మహిళలకు మొండిచేయి

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని కొట్టు అన్నారు. ఉచిత బస్సు పథకం అమలు చేయాలంటే నెలకు రూ.350 కోట్లు అవసరమవుతాయని.. ఇందుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడంతో మహిళలను మోసం చేసేందుకే ఈ హామీ ఇచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు అమలు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదన్నారు.

బీసీలకు మోసం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలకు బడ్జెట్‌లో రు.1.50 లక్షల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని మంత్రి కొట్టు విమర్శించారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులకు ఇచ్చిన హామీలన్నీ విస్మరించారని ఆరోపించారు. జాబు కాలెండర్ ప్రకటిస్తామని నిరుద్యోగులను మోసగించారన్నారు. చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చి పేదలను మోసం చేశారని కొట్టు అన్నారు.

ఇసుక పేరుతో దోపిడీ

కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే ఉచితంగా ఇసుక అందిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక రేటును మరింత పెంచి దోచుకుంటున్నారని కొట్టు అన్నారు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులు ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దిందని కొట్టు అన్నారు. విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై ఉక్కుపాదం

కన్వీనర్లు, కో–కన్వీనర్ల అరెస్ట్

కొయ్యలగూడెం/ఆకివీడు : రెడ్‌బుక్ రాజ్యాంగంతో రక్త చరిత్రను లిఖిస్తున్న కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఏలూరు జిల్లా కన్వీనర్‌పై పోలీస్ కేసు నమోదు చేసింది. తనపై వివిధ సెక్షన్లను ప్రయోగించి కేసు నమోదు చేసినట్లు చిక్కాల దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టారని పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో–కన్వీనర్ల ఇద్దరిని భీమవరం పట్టణ పోలీసులు రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. ఉండి మండలం పెదపుల్లేరుకి చెందిన పాటూరి దొరబాబు, ఆకివీడు మండలం అయిభీమవరం గ్రామానికి చెందిన కమతం మహేష్‌లను 41ఏ కింద నోటీసులు జారీ చేసి అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్ బెయిల్‌పై వీరిని విడుదల చేశారు.

గుంటూరులో అరెస్ట్ చేసి..

నూజివీడు: గుంటూరులో పోలీసులు అరెస్టు చేసిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ పి.రాజశేఖర్‌రెడ్డిని నూజివీడు రూరల్‌పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. 2023 జులై 15న వంగలపూడి అనితపై సోషల్‌మీడియాలో అనుచితమైన పోస్టులు పెట్టాడని, దీనిపై నూజివీడు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు ఈనెల 9న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. బుధవారం అరెస్టు చేశామని ఈనెల 14న నూజివీడు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



తణుకులో అయ్యప్పస్వామి పడిపూజకు ముస్తాబు చేసిన దృశ్యం

తణుకు అర్బన్: తణుకు జాతీయరహదారి సమీపంలోని శ్రీధర్మశాస్త్ర పంచాయతన అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి వేమూరి చలపతి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్వామివారికి అత్యంత వైభవంగా పడిపూజ నిర్వహించారు. ఈ పడిపూజ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలకంరించారు. స్వామివారు అధిరోహించే మెట్ల అలంకరణను పూలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. నిత్యపూజారి సత్యనారాయణ సమక్షంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం గురుస్వామి చక్రి ఆలపించిన అయ్యప్ప స్వామి భక్తిగీతాలు భక్తులను అలరించాయి. పూజాధికాల అనంతరం 250 మంది స్వాములు అల్పాహారం స్వీకరించారు. ఈ పడిపూజలో మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చక్కని చదువులతో పాటు పర్యావరణ పరిరక్షణ, దేశభక్తి అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని లయన్స్ క్లబ్ గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పీస్ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి రమణయ్య, మద్దుకూరి శ్రీహరి, చెన్నారెడ్డి సతీష్, కాళ్ళ గోపి కృష్ణ, నార్ని కృష్ణారావు, మరదాని రాము, ఎం.ఎం కుమార్, ప్రియాంక, పీకే ప్రసాద్, ప్రియాంక, హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

అత్తిలి: మంచిలి గ్రామంలో జూదశిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పి ప్రేమరాజు తెలిపారు. బుధవారం అత్తిలి మండలం మంచిలి శివారు కాలువ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడిచేసి వారి వద్ద నుంచి రూ. 11,090లు నగదు, 52 పేక ముక్కలు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీన పర్చుకుని వారిపై కేసులు నమోదు చేసామని ఎస్‌ఐ ప్రేమరాజు చెప్పారు.

అన్నదాతల్లో కలవరం



గూడెం- భీమవరం రోడ్డుపై ధాన్యం అరబెడుతున్న రైతులు



ప్రత్తిపాడు కాగులంపాడు ప్రాంతంలో తుఫాను హెచ్చరిక నేపథ్యంలో ధాన్యం రాసులపై బరకాలు కప్పి ఉంచిన దృశ్యం

- భయపెడుతున్న అల్పపీడనం
- కోత దశలో వరి పంట
- పలుచోట్ల రోడ్లపై రాశులుగా ధాన్యం

పెంటపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అన్నదాతను కలవరపెడుతోంది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరికోతలు, నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈదశలో భారీ వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతింటాయి. గత 10రోజులుగా పలు మండలాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ జిల్లాలో 12159 హెక్టార్లలో వరి కోతలు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కళ్లాల సదుపాయం లేకపోవడంతో కోసిన ధాన్యాన్ని రైతులు రోడ్లపై ఆరబెట్టి మిల్లర్లకు విక్రయిస్తున్నారు. పెంటపాడు, తాడేపల్లిగూడెం రూరల్ ప్రాంతాల రైతులు జాతీయ రహదారిరిపై ధాన్యాన్ని అరబెడుతున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి మబ్బులు కమ్ముకోవడమే గాకుండా, అక్కడక్కడా వర్షపు జల్లులు పడుతున్నాయి. దాంతో రైతులు ధాన్యం రాశులపై బరకాలు కప్పి తడవకుండా జాగ్రత్త పడ్డారు. భారీ వర్షం కురిస్తే బరకాల అడుగుభాగం నుంచి నీరు ధాన్యపు రాశుల్లోకి వెళ్లి తడిసిపోతుందని వారు భయపడుతున్నారు.

రైతులకు కళ్లాల సమస్య

ధాన్యం రైతులకు కళ్లాల సమస్య ఎక్కువగా ఉంది. కోసిన ధాన్యాన్ని గతంలో పొలాల్లో పనలపై ఆరబెట్టి కుప్పలు వేసి నిల్వ చేసేవారు. మార్కెట్లో గిట్టుబాటు ధర వచ్చినప్పుడు కుప్పలను నూర్చి ధాన్యాన్ని అమ్ముకొనేవారు. కొన్నేళ్లుగా పొలాల్లో కళ్లాలు ఏర్పాటు చేయడం కుప్పలు వేయడం రైతులు మానుకున్నారు. యంత్రాల ద్వారా వరి పంటను కోసి ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే రోడ్లపైకి తీసుకువచ్చి ఆరబెట్టి రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లర్లకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పొలాల్లో కళ్లాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఆకాల వర్షాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా బరకాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

వరి పంట కోయవద్దు

అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. వరి చేలు కోసి రోడ్లపై ఆరబెట్టవద్దు. రోడ్లపై ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకొని, అవకాశం ఉన్నంత వరకూ మిల్లులకు తరలించారు. డివిజన్‌లో చాలా మంది రైతులు ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే మిల్లులకు తరలిస్తున్నారు. ధాన్యం తడిస్తే తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల రైతులు గిట్టుబాటు ధర కోల్పోతారు. వాతావరణం అనుకూలించే వరకూ కోతలను నిలుపుదల చేయాలి.

– కె. పార్థసారథి,
మండల వ్యవసాయాధికారి

దళిత హక్కులను పరిరక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పొట్ల సురేష్

తణుకు టౌన్: అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను పరిరక్షించుకోవాలని, దళితులు ఐకమత్యంతో పోరాడాలని తణుకు నియోజకవర్గ దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు పొట్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలో నిర్వహించిన దళిత ఐక్యవేదిక సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసమావేశానికి మండల దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు నక్కా రమేష్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి దళితులంతా ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈసమావేశంలో కొమరవరం గ్రామ దళిత ఐక్య వేదిక నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడుగా బావన దొరబాబు, ఉపాధ్యక్షుడిగా బొంతా సుకుమార్, గల్లి శివ రవితేజలను ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఐక్య వేదిక నియోజకవర్గ కార్యదర్శి పీ రాజేష్, ఉద్యోగ సంఘాల నాయకుడు జీ మధు, మద్దిపాటి యేసు, కార్యవర్గ సభ్యుడు కాకి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులు పనిదినాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిన అప్పారావు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్.చిన అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకంపై తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ చిన అప్పారావు మాట్లాడుతూ రాబోయే ఏడాది నాటికి ఇప్పటి నుంచే ఉపాధి హామీ పథకం పనులు గుర్తించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు వారికి నిర్దేశించిన మ్యాండేట్లను పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి గ్రామంలోనూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాలని, లేని గ్రామాల్లో కొత్త వారి నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పనులు గుర్తింపు, పురోగతి వంటి వివరాలతో కూడిన సిటిజన్ చార్ట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఏపీడీ కేవీవీఎస్.ప్రసాద్ మాట్లాడుతూ కొత్త పనులను ఎఫ్‌ఏలు గుర్తించాలన్నారు. ప్లాంటేషన్ మేనేజర్ జే.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోడ్లు వెంబడి ఉద్యాన మొక్కలను నాటడం ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకూరుతుందన్నారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఇన్‌ఛార్జ్ ఏపీవో జే.థామస్, టెక్నికల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎంసీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి



గ్రంథాలయ వారోత్సవాల వాల్ పోస్టరు విడుదల చేస్తున్న ఆర్డీఓ

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ ఆఫీస్‌లో గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం వాల్ పోస్టర్లును ఆవిష్కరించారు. 14వ తేదీన గురువారం బాలల దినోత్సవ వేడుక, 15వ తేదీ శుక్రవారం పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాలపై అవగాహన, 16వ తేదీ శనివారం చిత్రలేఖనం పోటీలు, 17వ తేదీన ఆదివారం దేశభక్తి గేయాలు, 18వ తేదీన సోమవారం వ్యాసరచన పోటీలు, 19వ తేదీన మంగళవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవం, స్త్రీలకు ముగ్గులు పోటీలు, 20వ తేదీ బుధవారం ముగింపు కార్యక్రమంతో పాటు బహుమతి ప్రధానోత్సవం జరగనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు, గరికపాటి బాపయ్య శర్మ, జాన్‌బాబు, జనార్ధన్, పత్తిపాటి వీరస్వామి, లక్ష్మణరావు, ప్రేమ్‌కుమార్, తనూజా తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు



తణుకు డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు బయలుదేరిన ఆర్టీసీ బస్సుతో ప్రయాణికులు

తణుకు అర్బన్: అరుణాచలం గిరి ప్రదక్షిణకు తణుకు ఆర్టీసీ డిపో నుంచి బుధవారం సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు పంపించినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. బస్సులో వెళ్లిన భక్తులు గురువారం ఉదయం పంచ భూత లింగాలలో ఒకటైన శ్రీకాళహస్తి వాయులింగం దర్శనం చేసుకుని మధ్యాహ్నం కాణిపాకం శ్రీ విఘ్నేశ్వరస్వామి దర్శనానంతరం శ్రీపురంలోని స్వర్ణ దేవాలయం శ్రీమహాలక్ష్మి అమ్మవారి దర్శనం తర్వాత పౌర్ణమి రోజున అరుణాచలం చేరుకుని గిరిప్రదక్షిణ, పంచలింగ క్షేత్రాలైన అరుణాచలం అగ్నిలింగం దర్శనం చేసుకుని కంచి దేవాలయాన్ని దర్శించుకుని 17వ తేదీన తణుకు చేరుకుంటారని చెప్పారు. బస్సుల వివరాలకు 73829 07027, రిజర్వేషన్ కోసం 94404 19144 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు



సౌత్ జోన్ మహిళా టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

తణుకు టౌన్: సౌత్ జోన్ మహిళా టేబుల్ టెన్నిస్ పోటీలకు తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీ సుందరిబాయి తెలిపారు. ఈనెల 12వ తేదీన గణపవరంలో జరిగిన ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ మహిళా టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక పోటీలలో తమ కళాశాలకు చెందిన పీ బిందు ప్రవంతి, జీ అశ్విని భవానీ, టీ వినయ దుర్గ, ఏ నిస్సీశ్రీలు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ పోటీల నుంచి యూనివర్సిటీ మహిళా టేబుల్ టెన్నిస్ జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈజట్టులో తమ కళాశాలకు చెందిన పీ బిందు ప్రవంతి జనవరి 3వ తేదీ నుంచి చెన్నైలోని ఏఎంఇటీ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ మహిళా టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, పీడీ ఎం రత్నకుమారి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



రామన్నగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. తద్వారా దోమలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగేశ్వరరావు, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు దానమ్మ, సుశీల, సరళ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: పంచాయతీ కార్యదర్శి విధులను ఆటంకపరిచిన నేరంలో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. బుధవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని జిల్లా పరిషత్ భూముల్లో తానేటి శ్రీనివాసరావు అనే వ్యక్తి అక్రమ కట్టడం చేస్తున్నారు. దీనిని పంచాయతీ కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో తానేటి శ్రీనివాసరావు, మరో ఏడుగురు తన విధులకు ఆటంకపరిచారని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస చంద్రరాజు రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రూరల్ ఎస్‌ఐ జేఎస్‌వీ.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మండల, గ్రామ స్థాయి సిబ్బందికి శిక్షణ తరగతులు

తణుకు టౌన్: మండల పరిషత్ అభివృద్ధి, గ్రామ అభివృద్ధి ప్రణాళికపై గ్రామ పంచాయితీ ఈనెల 14న శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్ లోహిత్ జయ సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఒక రోజు ఈశిక్షణ తరగతులకు అన్ని మండల స్థాయి అధికారులతో పాటు అన్ని గ్రామాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు హాజరు కావాలని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

అత్తిలి: మండలంలోని ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి సత్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 20న విజేతలకు బహుమతి ప్రధానోత్సవ సభ జరుగుతుందని చెప్పారు.

గ్రామ స్వరాజ్యం దిశగా ప్రభుత్వం



దండగర్ర గ్రామంలో ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామ పంచాయతీలకు నిధులిచ్చి గ్రామ స్వరాజ్యం తెచ్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని దండగర్ర సర్పంచ్ పిల్లా రాంబాబు అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని దండగర్ర గ్రామ పంచాయతీకి మంజూరైన నూతన ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసాని రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరిమెళ్ల సర్పంచ్‌కు పితృ వియోగం

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావుకు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి పెదఅప్పారావు (85) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. గ్రామంలో దాతగా ఆయనకు పేరుంది. కాగా గొర్రెల కోటేశ్వరరావు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా ఉంటున్నారు. గతంలో కోటేశ్వరరావు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేసి, ప్రస్తుతం గ్రామంలో సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. సర్పంచ్ తండ్రి మృతివార్త తెలుసుకొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కోటేశ్వరరావును పరామర్శించారు.

కొనలేం.. తినలేం!

- వరుస తుపానులతో దెబ్బతిన్న కూరగాయల సాగు
- గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన ధరలు
- వినియోగదారుల ఉక్కిరిబిక్కిరి



అమ్మకానికి కూరగాయలు

తణుకు: కూరగాయల ధరలు వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వరుస తుపానుల కారణంగా పంటలు దెబ్బతిని దిగుబడులు భారీగా పడిపోయాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్లో కొరత ఏర్పడింది. దీంతో ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే బియ్యం, పప్పులు, వంట నూనెలతో పాటు వివిధ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధరల పెరుగుదలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పుడు కూరగాయల ధరలు కూడా వినియోగదారులకు ఆందోళన కలిగిస్తున్నాయి. రైతుబజార్లలోనే ధరలు భారీగా ఉంటున్నాయి. బయట మరింత ఎక్కువగా ఉంటున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం సున్నా

కూరగాయల కొరత ఏర్పడకుండా సాగును ప్రోత్సాహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. తణుకు పట్టణంలో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌కు పెరవలి, నిడదవోలు, పెనుగొండ మండలాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. అయితే ఆయా ప్రాంతాల్లో ఇందుకోసం సబ్సిడీలు కూడా ఇవ్వాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో కూరగాయల సాగుకు ప్రోత్సాహం లేకపోవడం రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కూరగాయల సాగుకు ప్రోత్సాహకాలు ఉన్నా.. ఆచరణలో అమలు కావడం లేదు. 50 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాల్సి ఉండగా ఈ ఏడాది ఒక్క రైతుకు కూడా అందించిన దాఖలాలు లేవు. ఖరీఫ్ ముగిసిపోయింది. రబీలో దాదాపు నెల గడుస్తోంది. ఇంతవరకు ఒక్క రైతుకు కూడా సబ్సిడీపై విత్తనాలు ఇవ్వలేదంటే ప్రభుత్వం మొద్దునిద్ర ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు.

ఏ కూరగాయ తీసుకున్నా కిలో రూ.50 పై మాటే...

గతేడాది నవంబరు నెలతో పోలిస్తే కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. గతేడాది నవంబరులో టమాట కిలో రూ.10, బీరకాయలు రూ. 30, వంకాయలు రూ.30, చిక్కుళ్లు రూ. 25, బెండకాయలు రూ. 20, క్యాలీఫ్లవర్ రూ.30 ఇలా ఏ కూరగాయలు తీసుకున్నా రూ.30 లోపే ఉన్నాయి. ప్రస్తుతం కూరగాయల ధరలు షాక్ కొడుతున్నాయి. ప్రస్తుతం టమాట రూ.30 ఉండగా బీరకాయలు రూ.60, వంకాయలు రూ.40 నుంచి రూ.60 వరకు, ఉల్లిపాయలు రూ.60, క్యారెట్ రూ.40, బంగాళదుంపలు రూ.40 పలుకుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే కూరగాయల ధరలు 30 నుంచి 50 శాతం వరకు ధరలు పెరిగాయి.